క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఊర్కొండ: మండలంలోని మాదారం 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయన్న గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

యూడైస్ ఫాంల పరిశీలన



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల అదిరాల, వావిల్లబాలి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం యూడైస్ ఫామ్స్‌ను థర్డ్ పార్టీ అధికారి అస్మా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో యూడైస్ ఫామ్స్‌ను పరిశీలనకోసం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మురళీ, ఈశ్వర్, పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మాచినేనిపల్లి, మాధవరావు పేట, గ్రామాలలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి ఇమ్మాన్యుయేల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 12న మాచినేనిపల్లిలో పాఠశాల సమయం ఉండగానే పాఠశాల మూసి వెళ్లిన విషయంపై విచారణ చేశారు. అనారోగ్యం కారణంగా ఉపాధ్యాయుడు లోకేష్ అరగంట ముందుగా వెళ్లినట్లు విచారణలో తేలింది. అనంతరం మాధవరావు పేటలో ఉన్న పాఠశాలను సందర్శించి మిడే డే మిల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఉన్నారు.

పోస్టర్ విడుదల

తాడూరు: జిల్లా కేంద్రంలో ఈ నెల 22న పూలే, అంబేద్కర్ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జాతర జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శివప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ గురుస్వామి జాతర సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. రెండు రోజుల పాటు నిర్వహించే జాతర కార్యక్రమానికి ప్రొఫెసర్ కాశీం, ఏపూరి సోమన్న, రాంనర్సయ్య, దేవేందర్ హాజరవుతారని పేర్కొన్నారు. జాతర సలహాదారులు ఐతోలు లక్ష్మయ్య, బాల్ వెంకటయ్య, బాలు, చింత సత్తి, తదితరులు పాల్గొన్నారు.

మూత్రశాల నిర్మాణ పనులు పూర్తి

తాడూరు: మండలంలోని అకునెల్లికుదురు పాఠశాల ఆవరణంలో గ్రామానికి చెందిన విజయకుమార్ రూ.2.50 లక్షల వ్యయంతో మూత్రశాల నిర్మాణం చేపట్టారు. అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసి హెచ్‌ఎం మోహన్‌సాగర్‌కు తాళం చేతులు అందించారు. దీంతో దాతను గ్రామస్తులు అభినందించారు.

అర్హులైన వారికి రుణాలు ఇవ్వాలి



తాడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని మంగళవారం ఇంటర్నేషనల్ హ్యుమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు బాలు ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. నిరుద్యోగులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. స్వయం ఉపాధికి తోడ్పాటునందించాలని కోరారు. రాజు, నరేష్, వెంకట్, ఉషన్న, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోడేరు: మండలంలోని రాజాపూర్, గుండ్యావాల్యానాయక్ తండాలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గుండ్యావాల్యానాయక్ తండాకు చెందిన కాట్రావత్ అనితమ్మకు రూ.12500లు, కాట్రావత్ చంద్రకళకు రూ.13వేలు, రాజాపూర్ గ్రామానికి చెందిన 6 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మాజీ ఎంపీటీసీ పార్వతి వెంకటస్వామి, తుకారం, తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌లను తొలగించాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలని కౌన్సిలర్ రమేష్‌రావు స్థానికులతో కలిసి మంగళవారం టీపీఓ మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. రాజీవ్ చౌరస్తాలో ఇటీవల ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ హోర్డింగ్‌కు ఎలాంటి అనుమతి లేకున్నా ప్రారంభించారని, ఎర్తింగ్ కోసం సీసీ రోడ్డును పగులగొట్టారని వివరించారు. ఎలాంటి అనుమతి లేని హోర్డింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని టీపీఓ హామీ ఇచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్లు.. యమపాశాలు

- విద్యుదాఘాతాలతో పశువులు మృత్యువాత
- నిర్లక్ష్యం వీడని విద్యుత్ అధికారులు



బల్మూర్ శివారులో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



గోదల్ శివారులో మృత్యువాత పడిన కాడెద్దు(ఫైల్)

బల్మూర్: మూగజీవాల పాలిట ట్రాన్స్‌ఫార్మర్లు యమపాశాలుగా మారుతున్నాయి. వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. దిమ్మెల ఎత్తు తక్కువగా ఉండటంతో పశువులు మేత కోసం వెళ్లి విద్యుదాదాఘాతానికి గురువుతున్నాయి. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తరచుగా వ్యవసాయ పొలాల్లో గేదెలు, కాడెద్దులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మృత్యువాత పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

మూడేళ్లలో 10 ప్రమాదాలు

మండల వ్యాప్తంగా గడచిన మూడేళ్లలో 10 ప్రమాదాలు జరిగినట్లు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. ఆయా గ్రామాల శివార్లలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుదాఘాతంతో గేదెలు, కాడెద్దుల మృత్యువాత చెందిన ఘటనలు ఉన్నవి.

వివరాలు ఇలా..

2023వ సంవత్సరంలో మే నెలలో బాణాలకు చెందిన కేతవత్ హన్మంత్‌కు చెందిన ఆవు, ఆగస్టులో మండలంలోని తుమ్మెన్‌పేటలో రైతు వీరయ్యకు చెందిన కాడెద్దు, ఇదే నెలలో గోదల్ గ్రామానికి చెందిన గుద్దటి మల్లయ్య ఆవు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. 2024 డిసెంబర్‌లో జీన్‌కుంటలో రైతు లక్ష్మయ్యకు చెందిన గేదె, రాములుకు చెందిన ఎద్దు మృతి చెందగా, బల్మూర్‌కు చెందిన బోయ రాములు గేదె, అనంతవరంకు చెందిన పర్వతాలు గేదెతో పాటు తాజాగా ఈ నెల 4న మండల కేంద్రం బల్మూర్ శివారులో వర్థం బాలయ్య రైతుకు చెందిన కాడెద్దు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి.

అందని పరిహారం

వరుసగా పశువులు మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులకు విద్యుదాఘాతంలో పశువులు మృతి చెందితే మరణించిన పశువులు విలువను బట్టి విద్యుత్ శాఖ వారు రూ. 50 వేల వరకు పరిహారం మంజూరు చేయాల్సి ఉంటుంది. కాని ఏళ్లు గడుస్తున్న బాధిత రైతులకు పరిహారాలు అందడం లేదు. దీనిపై విద్యుత్ శాఖ వారు పలు కొర్రిలు పెడుతుండటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండలంలో రెండేళ్ల నుంచి విద్యుదాఘాతంతో మృతి చెందిన పశువులకు నలుగురు బాధిత రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందనే లేదు.

కంచెల ఏర్పాటు చేయాలి

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచెల ఏర్పాటు చేయాలి. తక్కువ ఎత్తులో దిమ్మెలు అమర్చారు. పశువులు ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి మృత్యువాత పడుతున్నాయి. తక్కువ ఎత్తులో బిగించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి. విద్యుదాఘాతంతో రూ.40 వేల విలువ చేసే కాడెద్దు చనిపోయింది. అధికారులు నష్టపరిహారం ఇవ్వలేదు.

–వర్థం బాలయ్య, బాధిత రైతు బల్మూర్

రైతులే జాగ్రత్తలు తీసుకోవాలి

వ్యవసాయ పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు వేసే అనుమతి మాకు లేదు. రైతులే జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా రైతులు చూసుకోవాలి. రెండేళ్లలో మృతిచెందిన పశువుల వివరాలు సేకరించాం. మొత్తం 4 మృతిచెందినట్లు గుర్తించి నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

–సుధాకర్, ఏఈ, బల్మూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో మండలంలోని 9 గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పునుంతల, కొరటికల్, వెల్టూరు, మర్రిపల్లి, ఉప్పరిపల్లి, లక్ష్మాపూర్, దాసర్లపల్లి, మొల్గర, జప్తీసదగోడు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వరి పంటను సాగుచేసినట్లుగా సంబంధిత ఏఈఓ నుంచి ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డు, పట్టదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతోపాటు ఓటీపీ వచ్చే మొబైల్‌నంబర్‌ను తీసుకురావాలని కోరారు.

విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం



కోడేరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం అందజేస్తుందని ఎంఈఓ భాస్కర్‌శర్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, టైలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరానికి యూనిఫామ్స్ కుట్టించే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ కృష్ణయ్య, సీఆర్‌పీలు సాయి, నాగ్యానాయక్, విజయలక్ష్మి, బంగారయ్య, నాగేంద్రం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి

అచ్చంపేట రూరల్: అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదారాబాద్ నుంచి ఎమ్మెల్యే కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాల సూచించారు. ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డులు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి సారగట్ల మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అమ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ చిక్కుడు అనురాధతో పాటు జిల్లా యూత్‌కాంగ్రెస్ కార్యదర్శి నాయిని జైపాల్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు వెంకట్ గౌడ్, బీముడు నాయక్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మండల నాయకులు సురేందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, నర్సింహరెడ్డి, రాజేష్ గౌడ్, శ్రీపతిరావు, వెంకటయ్య గౌడ్, సహదేవ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఉప్పునుంతల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రవి, సాయిబాబు, శ్రీను, బాలునాయక్, పర్వతాలు, ఎల్లయ్యయాదవ్, చిన్నజంగయ్య, శేఖర్, బాలకృష్ణ, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి

మన్ననూర్: రాజీవ్ యువ వికాస్ పథకంలో అర్హులైన జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని నల్లమల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పెర్ముల కొండయ్య, ప్రధాన కార్యదర్శి కొర్రపాటి సైదులు ప్రభుత్వ పాలకులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న పాత్రికేయులకు అవకాశం ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఆదుకోవాలని వారు కోరారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

ఊర్కొండ: ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మరాసిపల్లి గ్రామ పరిధిలోని కొత్తకుంట దగ్గర పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, షెడ్‌నెట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ నర్సింహ, కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారించొచ్చని అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణమూర్తి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు అగ్నిప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధినిర్వహణలో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు.

నేడు కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకట్‌దాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నంబర్ 102లో కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్‌రెడ్డి కంటి ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసుకొని రిపోర్టుతో పాటు ఆధార్ కార్డు చూయించాలని కోరారు.

బస్సులో ప్రసవం తల్లీబిడ్డ క్షేమం

పెద్దకొత్తపల్లి: బస్సులో ప్రయాణిస్తున్న ఓ గర్భిణీ ప్రసవించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన సువర్ణ నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకొని నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్తోంది. మార్గమధ్యలో పెద్దకొత్తపల్లికి రాగానే గర్భిణీకి నొప్పులు ఎక్కువ కావడంతో ప్రయాణికులను దించారు. ఆశావర్కర్ మణిక్రాంతమ్మ, నర్సు పర్యవేక్షణలో సాధారణ కాన్పు అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం 108 అంబులెన్సులో పెద్దకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనం చోరీపై మంగళవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన జయప్రకాష్ మార్చి 17న కటింగ్ చేయించుకునేందుకు ద్విచక్రవాహనాన్ని ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చేలోగా ద్విచక్రవాహనం కన్పించలేదు. చోరీకి గురైన వాహనం ఎంత వెతికినా దొరకక పోవడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి



లింగాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన అవుసలికుంటలో మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ పర్యటించారు. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను ఆయన పనులను పరిశీలించి లబ్ధిదారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో మొట్టమొదటి ఇంటి నిర్మాణం ఇదేనని, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయించి ఆదర్శంగా నిలువాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



బాలికల ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

వెల్దండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేస్తున్నట్లు డీఈఓ రమేష్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ హైస్కూల్, కస్తూర్బా గాంధీ, బాలికల ఉన్నత పాఠశాల, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, ఎమ్మార్సీ పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



వంగూరు: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి అన్నారు. వచ్చేనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న హైందవ భక్తి సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ముఖ్యమంత్రి స్వంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భీమమ్మలాలూయాదవ్, మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం



తాడూరు: మండలంలోని గోవిందాయపల్లిలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడురోజులు పాటు నిర్వహించే జాతర ఉత్సవాల్లో మొదటి రోజు బండ్ల ఊరేగింపు నిర్వహించారు. యజ్ఞాలు, హోమాలు, అభిషేకం సుప్రభాత సేవ పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాఘవేందర్‌రావు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వన నర్సరీల పరిశీలన

మన్ననూర్: పదర మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వాహణలో ఉన్న వన నర్సరీలను ఎంపీడీఓ వెంకటయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉడిమిళ్ల గ్రామంలోని నర్సరీలలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఆదర్శ గ్రామంగా ఎంపికై న గానుగుపెంటలో మంజూరైన 30 ఇళ్లకు గాను 20 ఇళ్లకు మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ గోపి, పంచాయతీ కార్యదర్శి మత్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా



వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి, బందోనిపల్లి, చొక్కన్నపల్లి, చెర్కూర్, అజిలాపూర్, కొట్ర, బైరాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అధికారులు పర్యటించారు. సోమవారం కురిసిన వర్షంతో పాటు ఈదురుగాలులకు దెబ్బతిన వరి పంటలను పరిశీలించి పంటనష్టంను అంచనా వేశారు. మామిడి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు డాక్యానాయక్, సురేష్‌గౌడు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి

వెల్దండ: కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు తలారి నర్సింహ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బైరాపూర్‌లో అండర్ డ్రెయినేజీ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామానికి రూ.10 లక్షల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. నల్లపెద్ద జంగయ్య, దుబ్బతండాశ్రీనునాయక్, చెన్నయ్య, బాలనరసింహ, శేఖర్, గిరి, విష్ణు, సత్తయ్య, మహిపాల్, చెన్నయ్య, ఎల్లమ్మ, అంజమ్మ, జంగమ్మ, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



తెలకపల్లి: గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ల యాదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉద్యోగి కోమ్ము కాశన్న సమకూర్చిన పుస్తకాలను ఆయన పాత గ్రంథాలయానికి అందించి మాట్లాడారు. సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన 50 పుస్తకాలను వితరన చేయడంపై ఆయన దాతను అభినందించారు. ఎంపీఓ వెంకటయ్య, మాకం వెంకటేశ్వర్లు, శివశంకర్ అనంద్‌బాలచంద్రయ్య, నిరంజన్ రమేష్, గ్రంథాలయం వర్కర్ పవన్‌కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

కల్వకుర్తి టౌన్: వడ్ల గింజల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిసిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి మిర్యాలగూడకు వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాల వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగిపోవటంతో పాటుగా, గ్రిల్ సైతం దెబ్బతింది. ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు క్రేన్ సహాయంతో లారీని అక్కడి నుండి తొలగించారు.

'భగవద్గీతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'



అచ్చంపేట రూరల్: హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని వివిధ హిందూ సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఓం చౌరస్తాలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. భగవద్గీతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాశన్నయాదవ్‌ను ఆ పార్టీ నుంచి బేషరతుగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ హిందూ సంఘాల నాయకులు దామోదర్ శెట్టి, వేణుగోపాల్, వెంకటేష్, బాలాజీ, అశోక్ రెడ్డి, శ్రీనునాయక్, మహేష్‌చారి, రవీందర్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లింగాల: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు అంబట్‌పల్లి అటవీ శాఖ సెక్షన్ అధికారి రాంబాబు తెలిపారు. రాయవరం–యాపట్ల మధ్యలో ఉన్న గొర్రెమడుగు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా రాయవరం సమీపంలో గస్తీ తిరుగుతున్న అటవీ శాఖ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను స్వాధీన పర్చుకొని మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు సెక్షన్ అధికారి తెలిపారు.

బహుమతుల ప్రదానం

వెల్దండ: మండలంలోని కొట్రలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రీమియర్ లీగ్ సీజన్–5 అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారంతో ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రతిభ కనబర్చిన మొదటి, ద్వితీయ విజేతలకు నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. రవీందర్‌రావు, బాలస్వామి, శ్రీనివాస్‌యాదవ్, మల్లయ్య, పర్వతాలు, పరమేష్, మల్లేష్, సిద్ధార్థ్ మౌర్య, పరమేశ్వర్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

చెట్టు మీది నుంచి పడి వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్: మామిడి కాయల కోసం చెట్టెక్కిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని మార్చాల పంచాయతీ పరిధిలోని సూర్యలత కాటన్ మిల్‌లో ఒడిశాకు చెందిన అలక్ మాలిక్(37) పనిచేస్తున్నాడు. అయితే ఈ నెల 12న మిల్లు ఆవరణలోని మామిడి చెట్టు ఎక్కి కాయలు కోసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు హైదరాబాద్ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై మాలిక్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

హక్కులను కాపాడుకుందాం

వెల్దండ: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాలను నగారగడ్డ తండా, బైరాపూర్ గ్రామాల్లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.